క్లుప్తంగా

నేటి నుంచి అన్నదానం



పూజలో పాల్గొన్న మాలధారులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర స్వామి శివాలయంలో సోమవారం నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం మాలాధారులకు అన్నదానం నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. మండలంలో ప్రతి మాలధారణ స్వాములు హాజరుకావాలని వారు కోరారు.

శివాలయంలో హోమాలు



హోమ పూజలు జరుపుతున్న పూజారులు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని బొమ్మవరం శివాలయంలో ఆదివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి పూజారులు భక్తి శ్రద్ధలతో హోమం తదితర కార్యక్రమాలను జరిపించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట : రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, సిద్దారెడ్డిపల్లి, పాపక్కగారిపల్లి, పుల్లారెడ్డిపల్లి గ్రామాలకు రూ. 30 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయశ్రీ, సాయివికాస్‌రెడ్డి, గంగిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏపీఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి పూజలు

పుల్లంపేట : కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం కావడంతో పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

నేలవాలిన భారీ వృక్షం



నేలకొరిగిన వందేళ్ల నాటి చింతచెట్టు

పుల్లంపేట : మండలంలోని కడప – చెన్నై జాతీయ రహదారి రామక్కపల్లి రోడ్డు పక్కన ఉన్న పెద్దచింతచెట్టు ఇటీవల కురిసిన వర్షాలకు భూమి నానిపోవడంతో నేలకొరిగింది. సుమారు వంద సంవత్సరాలు వయస్సు కల్గిన భారీ చింతచెట్టు నేలకొరిగే సమయంలో ప్రజలు ఎవరూ రోడ్డుపై లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వృక్షం రోడ్డుపై కాకుండా పక్కన పడటంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగలేదు.

పరామర్శ



వేంపల్లె బాషా దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట రూరల్ : మండలంలోని సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి, అన్నమయ్య కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు వేంపల్లె బాషా ఇటీవల మృతి చెందారు. సున్నపురాళ్లపల్లెలో ఆదివారం జరిగిన వేంపల్లె బాషా దశదినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొని వేంపల్లె బాషా కుమారుడు మస్తాన్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి వేణుగోపాల్‌రెడ్డి, దండు గోపి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, మేడా నాగేశ్వర్‌రెడ్డి, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, రెడ్డయ్యరెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

అరిగె సుమంత్‌కు డాక్టరేట్



నందలూరు : నాగిరెడ్డిపల్లి పంచాయతీ అరవపల్లెకు చెందిన అరిగె సుమంత్‌కు ఐఐటీ మద్రాసు వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సుమంత్ మాట్లాడుతూ సెమీ కండక్టర్ల పనితీరు మీద తాను పరిశోధనలు చేశానన్నారు. సుమంత్‌కు డాక్టరేట్ రావడంపట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు, మండలంలోని ప్రముఖులు సంతోషం వ్యక్తం చేశారు. సహకరించిన వారికి సుమంత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నిర్లక్ష్యపు మురుగు తొలగేనా?

- కోడూరు పట్టణంలో పడకేసిన పారిశుధ్య చర్యలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పొట్టిశ్రీరాములు వీధిలో రోడ్డుపై చెత్త కుండి



ధర్మాపురంలో డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త వేసే ప్రాంతం

రైల్వేకోడూరు అర్బన్ : గడిచిన మూడు రోజులుగా పడిన వర్షాలతో రైల్వేకోడూరు పట్టణంతో సహా పలు చోట్ల పారిశుధ్యం పడకేసింది. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో దోమల బెడద తీవ్రమైంది. ఈ కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లోనూ పారిశుధ్యం కుంటుపడడంతో జ్వర పీడితుల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నాయి. పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రోజురోజుకు జ్వరాలు అధికమవుతున్నాయి జ్వర పీడితులు తెలియజేశారు. దోమకాటు బారిన పడిన రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల వారు పేద ప్రజలకు పరీక్షల పేరుతో డబ్బులు దండుకుంటున్నారు. పట్టణంలోని రంగనాయకుల పేట, ధర్మాపురం, అంకమ్మనగర్, పాతబజార్, ఉంగరాలనగర్, తపాలా కార్యాలయం వెనుక వీధి తదితర ప్రాంతాలతోపాటు లక్ష్మీప్యారడైజ్ ఎదురు వీధిలో మురుగు నీరు నిల్వ ఉంటుంది. ఈ రోడ్లలో పెద్దఎత్తున ప్రతినిత్యం పాఠశాలలకు విద్యార్థులు, మహిళలు ప్రయాణిస్తుంటారు. కంపు భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. దీనికి తోడు చెత్తాచెదారంతో పేరుకుపోవడంతో అపరిశుభ్రతగా ఉన్న ప్రాంతంలో పందులు సంచరిస్తూ చెత్తను రోడ్డుకు తెస్తున్నాయి. ఈ కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజారోగ్య పరిరక్షణకు నడుంబిగించి పారిశుధ్య పనులు చేపట్టాలని విద్యార్థులు, మహిళలు, స్థానికులు కోరుకొంటున్నారు.



ముష్టేరు వద్ద స్వైర విహారం చేస్తున్న పందుల గుంపు



అంకమ్మనగర్‌లో ఎంపీపీ స్కూల్ పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాలు

పిల్లలను బడికి పంపలేకున్నాం



ప్రతినిత్యం పాఠశాలలకు పిల్లలను పంపాలంటే ఇబ్బంది పడుతున్నాం. డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతూ ఎక్కడికక్కడ నిలుస్తుండటంతో అడుగు ముందుకు వేయలేకున్నారు వారి పరిస్థితిని చూసి బడి పంపాలన్న భయం వేస్తోంది. పట్టణంలో పలు రోడ్లు మురికి కూపంలా మారాయి. వర్షం పడితే చెత్తకుప్పల పక్కనుంచి పోవాలంటేనే దుర్వాసన భరించలేకున్నాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రత్తయ్య, రంగనాయకులపేట, రైల్వేకోడూరు


డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



పట్టణంలో పలు వీధులు వర్షాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రతినిత్యం పాఠశాలలకు విద్యార్థులు, సొంత పనులపై మహిళలు, వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అపరిశుభ్రతగా ఉంటూ మురికి నీరు ప్రవహిస్తూ ఉంటోంది. దీని వల్ల దోమల బెడద అధికంగా ఉంది. రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యం వీడని పక్షంలో ప్రజాపోరాటానికి దిగుతాం.

– దార్ల రాజశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి, రైల్వేకోడూరు

పోలీస్ అమరుల త్యాగాలు మరవలేనివి



గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : పోలీసుల అమరవీరుల త్యాగాలు మరవలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పోలీస్ అంటేనే సేవ, త్యాగం, గంభీరం, తెగువ వంటి పదాలకు పర్యాయ పదాలన్నారు. దేశంలోని చైనా సరిహద్దు ప్రాంతమైన అక్సయ్‌చిన్‌లో 1959 అక్టోబర్ 21న సీఆర్‌పీఎఫ్ జవానుల వీరోచితంగా పోరాడి చైనా సైనికుల నుంచి దేశ ఆక్రమణ కాకుండా అడ్డుకున్నారు. అప్పుడు జరిగిన పోరాటంలో పంజాబ్ చెందిన జవానులు మృతి చెందారని వారి స్ఫూర్తి, త్యాగాలకు గుర్తుగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రజలకు ఏ అన్యాయం జరిగినా, ఆపద వచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసేనని అన్నారు. పోలీస్ లేని సమాజాన్ని ఊహించడానికి వీలు కాదన్నారు. శాంతి భద్రతల కట్టడిలో పోలీస్ వ్యవస్థ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

కోడూరుపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

రైల్వేకోడూరు అర్బన్ : బ్రిటీష్ కాలం నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎంతో ఉపయోగపడిన రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌కు న్యాయం చేయలేని కేంద్ర ప్రభుత్వం ఎందుకని మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఆదివారం తెలిపారు. రైల్వేసేవలు అందిస్తున్నందుకే రైల్వేకోడూరు అనేపేరు సార్థకమయ్యిందని, దానిని గుర్తించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య దోరణి ప్రజలు గమనిస్తున్నారన్నారు. తగిన సౌకర్యాలు కల్పించలేమని సిగ్గు తెచ్చుకొని పేరన్నా మార్చాలని ఆయన పేర్కొన్నారు.

ధర్మపోరాటంలో అందరూ ఏకం కావాలి



విలేకరులతో మాట్లాడుతున్న పండుగోల మణి

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్డీయే కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీలో అధికారులకు లంచాలు ఇచ్చి, భయపెట్టి నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న వైన్ షాపులను తొలగించడానికి నేడు (సోమవారం) జరగబోయే ధర్మపోరాటంలో ప్రజలు, కళాశాల విద్యార్థులు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు పండుగోల మణి ఆదివారం పిలుపునిచ్చారు. సోమవారం ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేసి మంచి ప్రభుత్వం అంటూ ప్రజల్లోకి వచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అడుగడుగునా బ్రాందీషాపులు ఏర్పాటు చేసి మహిళలు, విద్యార్థులకు భద్రత లేకుండా చేసిన ఘనత సీఎం చంద్రబాబు, కూటమి పార్టీల నాయకులకే చెల్లుతుందన్నారు. మద్యంపై పెట్టిన శ్రద్ధ పేద, బడుగు, బలహీన వర్గాల వారు ఎదుర్కొంటున్న నిత్యావసర సరుకుల ధరలపై ఎందుకు మక్కువ చూపలేదని ఆయన ప్రశ్నించారు. పరిపాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉండే చోట బ్రాందీషాపులు ఎత్తివేయాలని సోమవారం ధర్మపోరాట కార్యక్రమంలో అన్నిరాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కులసంఘాల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.జయరామయ్య, దార్ల రాజశేఖర్, మేకల రమణయ్య, వెంకటరమణ, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కనుసన్నలో ఇసుక, మద్యం మాఫియా

సిద్దవటం : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు డేగనవాండ్లపల్లెకు వచ్చారు. విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ కనుసన్నల్లో మద్యం, ఇసుక మాఫియా జరుగుతోందన్నారు. ప్రజల సొమ్మును కూటమి నేతలు దోచుకో, పంచుకో, దాచుకో అన్న చందంగా మద్యం దుకాణాలు తెరిచారని ఎంఆర్‌పీ ధరల కంటే బాటిల్‌పైన రూ. 20 అధికంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచిత ఇసుకను అందిస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక అధిక ధరలకు ఇసుకను విక్రయించడం లేదా అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాము అమ్మకు వందనం ద్వారా ఇంట్లో చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉంటే అంత మందికి వారి తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున వేస్తామని చెప్పి అమ్మకు వందనం కంటే ముందు నాన్నకు ఇందనం ప్రవేశ పెట్టారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శి వలీచాన్, మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, సీనియర్ నాయకుడు టక్కోలు క్రిష్టారెడ్డి, ఆనంద్‌రెడ్డి, మరికొందరు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర హామీలను అమలు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నవంబరు 27 నుంచి 30 వరకు విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆయన యూనియన్ నేతలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకంను అమలు చేయాలన్నారు. ఉన్నత చదువులకు శాపంగా మారిన జీఓ నం. 77, వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేసే జీఓ నం. 107, 108లను రద్దు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు తర్వాత హామీ అమలును గాలికి వదలేయడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేయాలంటూ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రమహాసభలకు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, మాధవ్, ఆఫీస్‌బేరర్స్ వినయ్, వినోద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సంబేపల్లె: దర్శనమిస్తున్న దేవరరాయి నల్లగంగమ్మ



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా అర్చకులు వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు జరిపించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసిన శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లి : వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా కరుణించు గంగమ్మ అంటూ ఆదివారం మండలంలోని అనంతపురం గ్రామంలో కొలువైన గంగమ్మకు భక్తులు మొక్కారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గంగమ్మ దర్శనానికి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు, ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి



కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్న మోహన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అప్పకొండయ్యగారిపల్లెకు చెందిన ఆరంరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంతోపాటు ఆయన మనుమరాలు కేశఖండన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు. అలానే మద్దిరేవుల గ్రామం కొత్త మాదిగపల్లెకు చెందిన సాయికుమార్ కుమారుడు కేశఖండన కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రాయచోటి మైనార్టీ నాయకులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బేపారి మహమ్మద్ ఖాన్, ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డి, మద్దిరేవుల ఉపసర్పంచ్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సంబేపల్లె : మండలంలో 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సంబేపల్లె పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8 మంది వ్యక్తులతోపాటు వారి నుంచి రూ.4200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నూతన వధూవరులకు ఆకేపాటి ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని డేగనవాండ్లపల్లె గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సింగం శ్రీరాములరెడ్డి కుమారుడు, వారి బంధువులు ఇరువురి వివాహ వేడుకలకు ఆదివారం వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, సీనియర్ నాయకుడు టక్కోలు క్రిష్టారెడ్డి, ఆనంద్‌రెడ్డి, మరికొందరు నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం



పాపినేని విశ్వనాథరెడ్డి

రాజంపేట టౌన్ : నాలుగు నెలల్లోనే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామస్థాయి నుంచి ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అస్తవ్యస్తమైన నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి తరుణంలో ప్రజలకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల అండ ఎంతైనా అవసరమన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చూడలేక ప్రజల పక్షాన నిలిచి పోరాటాన్ని ప్రారంభించారని, ప్రతి కార్యకర్త పార్టీ అధినేతకు వెన్నంటి నిలిచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను, అరాచకాలను ప్రజాక్షేత్రంలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం ఇసుక ధర ఆకాశాన్నంటడంతో సామాన్య ప్రజలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే తక్కువ ధరకే మద్యం ఇస్తానన్న ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు జరుపుతోందని తెలియజేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉద్యమించాలన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి ఇబ్బందులను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలుద్దామని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో పార్టీకోసం కష్టపడిన వారికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే జగన్ ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

ఉత్పత్తిదారుల సంస్థలో రైతులు చేరాలి

సిద్దవటం : మండలంలోని రైతులు అందరూ రైతుల ఉత్పత్తిదారుల సంస్థ నుంచి సభ్యత్వ తీసుకొని దళారీ వ్యవస్థ నుంచి విముక్తి చెందాలని జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం రైతుల ఉత్పత్తిదారుల సంస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 2019 సంవత్సరంలో రైతుల దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి పదివేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రారంభించి దళారీ వ్యవస్థ రూపురేఖలను మార్చాలని ఆలోచన చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని వరి, చామంతి, ఉల్లి, అరటి, తోటలు దెబ్బతిన్నాయన్నారు. అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన అన్నారు.

వర్షాలకు వరి పంటలో మొసులు



దెబ్బతిన్న వరిపంటను చూపుతున్న రైతు పెంచలయ్య

పెనగలూరు : వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రైతాంగం పూర్తిగా నష్టపోయారు. వరితోపాటు సాగు చేసిన అన్ని పంటలు, ఉద్యాన తోటలపై పెద్ద ప్రభావం చూపిందన్నారు. కాగా మండలంలోని ఎగువ సిద్దవరంలో రైతు పెంచలయ్యయాదవ్ రెండు ఎకరాల భూమిలో వరి పంట వేశాడు. పంట చేతికందే సమయంలో నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు వరి పంటలో మొసులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొసులొచ్చిన పంటను కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

వీరబల్లి : రైతులు భూ సమస్యలను రెవెన్యూ సదస్సులు ద్వారా తీర్చాలని ఫార్మర్స్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ సర్వే కార్యక్రమాన్ని సానిపాయి, ఒడివీడు పంచాయతీలలో నిర్వహించి భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలు రైతులకు ఇచ్చారన్నారు. అయితే పాస్ పుస్తకంలో ఉన్న సర్వే నెంబర్లకు 1–బీలు రావడం లేదన్నారు. కొంతమంది భూములు మరొకరు పేరుతో 1–బీలో వచ్చాయన్నారు. ఇటువంటి సమస్యలను రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరించాలని వారు కోరారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

ఒంటిమిట్ట : నందలూరు మండలం నుండి కడప వైపు ఎటువంటి ఆధారాలు లేకుండా వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను శనివారం రాత్రి ఒంటిమిట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను శనివారం రాత్రి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

రహదారులు ఇలా.. వెళ్లేదెలా..?

- నరకంగా మారిన గ్రామీణ రోడ్లు
- వాహనదారులకు పొంచివున్న ప్రమాదం



బండకాడ హరిజవాడ సమీపంలో రహదారిపై మడుగును తలపిస్తున్న వర్షపునీరు

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో లింకురోడ్లు, తారురోడ్లు గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా ఇలా దేవపట్ల నుంచి వంకవారిపల్లె, దిగవ రాజువారిపల్లె, హరిజనవాడ మీదుగా చిన్నబిడికి వరకు, శెట్టిపల్లె కస్పానుంచి సరిపిరాళ్లపల్లె మీదుగా యర్రమోరంపల్లె, శెట్టిపల్లె నుంచి దుద్యాల కోటకాడపల్లె లింకు రోడ్డు వరకు నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు పూర్తిగా తారు లేచిపోయి గుంతలు ఏర్పడి నీళ్లు నిలబడ్డాయి. ఫలితంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు పలుమార్లు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. బాలింతలు, గర్భిణులు, వైద్యశాలలకు ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ప్రతి కిలో మీటర్‌కు అరకిలో మీటర్ తారు రోడ్డుపై కంకర లేచి గుంతలు ఉండటంతో బస్‌లు, ఆటోలలో ప్రయాణిస్తున్న ప్రజలు ఒళ్లు గుల్ల చేసుకొంటున్నారు. తారు రోడ్డుల మరమ్మతుల విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకర లేచిపోవడంతో వర్షానికి నరకంగా మారిన చిన్నజంగంపల్లె రోడ్డు



గుంతలమయంగా తయారైన వడ్లపల్లె రోడ్డు